Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 92
సంచిక : 218
పేజీలు : 3
ఆదివారం, ఏప్రిల్ 19, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN


## ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ అంకిత్ తనిఖీలు



**టీ మీడియా, ఏప్రిల్ 20 , టేకులపల్లి:** విద్యార్థులకు అందుతున్న సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. మండలంలోని టేకులపల్లిలో ఏకలవ్య, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, పరిసరాల పరిశుభ్రత, భోజన నాణ్యత పై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో స్వయంగా మాట్లాడి అందుతున్న సదుపాయాలు, భోజన నాణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థుల పఠన సామర్థ్యం, బోధనా నాణ్యత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

# బీటీ రోడ్డుపై పేరుకుపోయిన మట్టి



**-ప్రాణాలు గాల్లో దీపాలు**

**టీ మీడియా,ఏప్రిల్20,భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలోనే కీలకమైన ప్రధాన రహదారి.. నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగే మార్గం. కానీ నేడు ఆ రోడ్డు జూలూరుపాడు వాసులకు ఒక నరకప్రాయమైన అడ్డంకిగా మారింది. రోడ్డుపై అడుగు పొరలా పేరుకుపోయిన మట్టి వాహనాలు వెళ్తుంటే లేస్తున్న ధూళి మేఘాలు వెరసి జూలూరుపాడును ఒక 'డస్ట్ జోన్'గా మార్చేశాయి. అధికారుల ఉదాసీనత కేవలం ప్రయాణికుల ప్రాణాలకే కాదు, స్థానిక వ్యాపారుల జీవనోపాధికి కూడా గొడ్డలి పెట్టులా మారింది.

**లక్షల్లో నష్టం**

రోడ్డు పక్కన ఉన్న కంప్యూటర్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, ఫొటో స్టూడియోల పరిస్థితి వర్ణణాతీతంగా ఉంది. నిరంతరం లేస్తున్న సూక్ష్మ ధూళి కణాలు అత్యాధునిక యంత్రాల్లోకి చేరి వ్యాపారులను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. ఫొటో ప్రింటర్లు, హై-ఎండ్ డిజిటల్ కెమెరాలు, జిరాక్స్ మిషన్లలోని సెన్సార్లు ధూళి కారణంగామొరాయిస్తున్నాయి. ఒక్కో సెన్సార్ లేదా మదర్ బోర్డ్ పాడైతే వేల రూపాయల ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. డస్ట్ వల్ల యంత్రాలు తరచూ రిపేరుకు వస్తుండటంతో, కస్టమర్లకు సేవలు అందించలేక వ్యాపారాలు మూతపడే స్థితికి చేరుకున్నాయి. మిగతా 3లో

## ఎలుకల మందు తిని బాలిక ఆత్మహత్య



**టీ మీడియా,ఏప్రిల్20,సింగరేణి(కారేపల్లి):** ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఫెయిల్ అయ్యానని బాలిక ఎలుక మందు త్రాగగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన ఘటన దుబ్బతండాలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గుగులోత్ బాలాజీ-అరుణ దంపతుల పెద్ద కుమార్తె అయిన గుగులోత్ సంజన(17) కారేపల్లిలో తాతయ్య ఇంట్లో ఉంటూ ఇంటర్ చదువుతుంది. ఇటీవల ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాలలో ఫెయిల్ కావటంతో మనస్థాపం చెందిన సంజన ఈనెల 17న ఎలుక మందు తినగా ఖమ్మం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది.

## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



**టీ మీడియా,ఏప్రిల్20, సింగరేణి (కారేపల్లి):** ఆ .కొత్తకమలాపురంకు చెందిన శాగంటి కృష్ణయ్య(46) వ్యవసాయం పెట్టుబడులు రాక గిట్టుబాటు కావటంలేదని ఖమ్మంలో వివిధ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. వ్యవసాయ పెట్టుబడులకు తెచ్చిన అప్పులతో పాటు పిల్లల చదువులు, కుటుంబం గడవటానికి చేసిన అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అయ్యాయి. దీంతో మనస్థాపం గురైన కృష్ణయ్య కమలాపురంలోని ఇంటి వద్ద కలుపు మందు సేవించాడు.దీనిని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని ఖమ్మం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య స్వప్న, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# హరీష్ రావు .. కాళ్ళేశ్వరావు

### -రుణమాఫీ పై మాట్లాడే నైతిక హక్కు ఉందా..?

### విలేకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల ధ్వజం

**టీ మీడియా, ఏప్రిల్ 20 , ఖమ్మం:** తన్నీరు హరీష్ రావు కాదు.. కాసుల రావు, కమీషన్ల రావు, కాళ్ళేశ్వరరావు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నామకరణం చేశారు. కమీషన్ల కోసం ఆరాటపడేది నేనా..? కాళ్ళేశ్వరరావా..? చర్చకు సిద్ధమని, సిద్ధపేట రమ్మంటావా..? అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హరీష్ రావు సవాల్ విసిరారు. నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఏం లేదు అన్నారు. సోమవారం ఖమ్మం మంత్రి క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాజీ మంత్రి హరీష్ రావు పై ధ్వజమెత్తారు. భూకబ్జాలు గూర్చి నీతులు చెప్పే హరీష్ రావు నిన్న మీటింగ్ పెట్టింది కబ్జా కోరుల స్థలంలోనే అని ఆరోపించారు.కాళేశ్వరరావుగా ముద్రపడ్డ హరీష్ రావు కాంగ్రెస్ కు నీతులు చెబుతున్నారని దుయ్యబట్టారు. హరీష్ రావు సొంత పార్టీలో రాజకీయ భవిష్యత్ కోసం మానసిక దౌర్భాగ్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. కబ్జాదారుడు, అవినీతి కాంట్రాక్టర్ ను పక్కన పెట్టుకుని మాకు నీతులు చెబుతున్నారని అన్నారు. సిగ్గు లేకుండా ఏ మోహం పెట్టుకుని మళ్ళీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని విమర్శించారు. రుణమాఫీ పై మాట్లాడే నైతిక హక్కు హరీష్ రావు కు లేదని, దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒకే సారి రెండు లక్షల కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదని కొనియాడారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో సీతారామ ప్రాజెక్టు గూర్చి మీ గొప్పగా చెబుతున్నారు కానీ మీ పాలనలోనే పడావు పడేసిన సంగతి మర్చిపోతే ఎలా అని గుర్తు చేశారు. సెంట్రల్ వాటర్ కమీషన్ అనుమతులు లేకుండా కమీషన్ల కోసం ప్రాజెక్ట్ ను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.



**సిద్దిపేటకు వస్తా చర్చకు సిద్ధమా..?**

కమీషన్ల తీసుకునేదేవరో.. కాసులు వెనకేసుకుందేవరో..? రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందేవరో..? చర్చించుకుందాం.. సిద్ధిపేటకు రమ్మంటావా..? అంటూ మాజీ మంత్రి హరీష్ రావు కు తుమ్మల సవాల్ విసిరారు. నీ సిద్ధిపేటకు వస్తా.. రైతాంగం శ్రేయస్సు కోసం స్ట్రాటజిక్ లొకేషన్ లో పెట్టిన పామాయిల్ ఫ్యాక్టరీ పై చర్చకు సిద్ధమా..? అని ప్రశ్నించారు. హరీష్ రావు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ప్రజలు అన్ని చూస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఆ ఒక్క సీటు కూడా రాదని జోస్యం చెప్పారు.

**రైతుల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్షయమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతమైన స్కీములను ప్రవేశపెట్టింది అన్నారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను నట్టేటా ముంచేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యానికి బోనస్ ఇచ్చి అందుకుంటున్నామని తెలిపారు. రైతుల కోసమే రైతు భరోసా ఇస్తున్నామని, యంత్రలక్ష్మి పథకం ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాలను సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు.హరీష్ రావు స్వంత నియోజకవర్గంలోనే మిగతా 3లో






## మొక్కజొన్న రైతుల సమస్యలు పరిష్కరించాలి

**టీ మీడియా, ఏప్రిల్ 20 , తిరుమలాయపాలెం :** ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో సోమవారం జరిగిన సంఘం మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్నలు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి తమ సంఘం ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు. తిమ్మిడా హనుమంతరావు పాల్గొన్నారు.




## అంగన్వాడీ కేంద్రానికి సన్ రైజ్ సేవా సమితి చేయూత.

**టీ మీడియా, ఏప్రిల్ 20 ,కొణిజర్ల :**మండల పరిధిలోని రామనర్సయ్యనగర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సన్ రైజ్ అభ్యుదయ సేవా సమితి వైరా ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమం ప్రశంసలు అందుకుంది. బీజేపీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్ బాబు తండ్రి ఏనుగు రాఘవయ్య జయంతి సందర్భంగా సుమారు రూ.15,000 విలువైన బేబీ చైర్స్, గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలకు కుర్చీలు, వాటర్ క్యాన్, ఫ్యాన్, టేబుల్ వంటి అవసరమైన వస్తువులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లాడ మండల పంచాయతీ అధికారి ఏనుగు సురేష్ బాబు మాట్లాడుతూ, సన్ రైజ్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన వస్తువులు అందించడం ద్వారా సమాజానికి మంచి సేవ చేస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతీ దాస్, సంస్థ ప్రతినిధులు శోభన్ బాబు, అంగన్వాడీ టీచర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## గడపలోనే కులం దాటితే హిందువులం

**టీ మీడియా ,ఏప్రిల్ 20 ,కొణిజర్ల:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది కార్యక్రమాలలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. సంఘ మూలాలతో జాతీయ బావాలు కలిగించేలా అనేక రంగాల్లో విస్తరించి దేశవ్యాప్తంగా సేవలందిస్తుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వందేమాతరం రవీందర్ మాట్లాడుతూ గడపలోనే కులం గడప దాటితే హిందువులం అని. సమాజంలో కుల వివక్షత లేకుండా మనమంతా కలిసి ఉండాలని. హిందుత్వం అంటే మతము కాదు మన జీవనం నిదానమని అన్నారు. భారతదేశంపై విదేశీ దురాక్రమణదారులు మన దేశం మీద అనేకసార్లు దండెత్తి దేశ సంస్కృతి నాశనం చేస్తూ దేశ సంపదని దోచుకు వెళ్లారు. కానీ మన దేశం ఎప్పుడు వేరొక దేశముపై యుద్ధానికి వెళ్లలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రామడుగు నరసింహచార్యుస్వామి, సంకిపల్లి కీర్తి రెడ్డి, తూము అప్పారావు, కాటేపల్లి లక్ష్మీనారాయణ, మందడపు రామారావు, నెల్లూరు కోటేశ్వరరావు, బండారు నరేష్, కవిడ మురళీకృష్ణ, పెరిక బాలాజీ , హిందూ సమ్మేళనం నిర్వహణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# చివరి పేదోడికి న్యాయం చేరాలి.

### బిజెపి రాష్ట్ర నాయకులు శ్రీధర్ రెడ్డి

**టీ మీడియా ,ఏప్రిల్ 20 ,కూసుమంచి:**సమాజములో అధిక సంఖ్యలో ఉన్న పేదలు అన్యాయం, అక్రమాలకు గురవుతున్నారని, దేశంలోని సంపద అంతా ప్రతి పౌరుడికి సమోపయోగంగా అంది చివరి పేదోడి వరకు న్యాయం జరగాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, పార్టీ వరంగల్ జిల్లా ఇన్చార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. కూసుమంచి మండలం పాలేరులోని బజ్జూరి వెంకటరెడ్డి ఫంక్షన్ హాల్ నందు బి జె పి ఆధ్వర్యంలో సోమవారం పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్ర శిక్షణ మహాభియాన్ సోమవారం జరిగింది.. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్ర శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. భారతీయ జనతా పార్టీ కూసుమంచి మండల అధ్యక్షురాలు పుణ్యవతి అధ్యక్షతన జరిగిన ప్ర శిక్షణ శిబిరం సభలో శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వం లో అట్టడుగు వర్గ ప్రజల సంక్షేమం అభ్యున్నతి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వారికి ఆర్థిక ఫలాలు అందే పాలన కొనసాగుతుందని ఆయన అన్నారు. దేశంలో కమ్యూనిజం, క్యాపిటల్ ఇజం వల్ల ప్రజలు అజ్ఞానంతో అభివృద్ధికి దూరమయ్యారని ఆయన తమ ఆవేదన వ్యక్తం చేస్తూ, ఏకాత్మ మానవవాదం మూల సిద్ధాంతంతో న్యాయం, ధర్మం, విలువలు పాటిస్తూ తాము రాజకీయంగా యావత్తు దేశ ప్రజామోదం పొంది, నరేంద్ర మోడీ నాయకత్వము లో అగ్ర భాగాన నిలిచామన్నారు. దశాబ్ద కాలం కి పైగా పాలనతో నేడు దేశాన్ని ప్రపంచంలో మూడవ స్థానములు అభివృద్ధి దిశగా నరేంద్ర మోడీ దేశాన్ని నిలిపారని కొనియాడుతూ, ప్రపంచంలోనే భారతదేశం మొదటిగా ఉండేందుకు ప్రతి భారతీయ పౌరుడు తమ వంతు బాధ్యతగా సహకారం కృషి చేయాలని శ్రీధర్ రెడ్డి కోరారు.

**మహిళలు ముందుండాలి. పుణ్యవతి.**

భారతీయ జనతా పార్టీ కూసుమంచి మండల అధ్యక్షురాలు పుణ్యావతి సభ అధ్యక్షా ఉపన్యాసం చేస్తూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఇంటి నుండి మొదలుకొని దేశం వరకు మహిళ పాత్రలేని పని లేదని గుర్తెరిగి, జనాభాలు సగభాగం అయిన మహిళలు అదే స్థానంలో నిలవాలని కోరారు. అన్ని రకాల ప్రజా సమస్యల పరిష్కారంలో బిజెపి పార్టీగా ముందు నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. అలాగే



ఎన్నికల బరిలో గెలుపు ఓటములు సహజమని చెప్పుతూ రానున్న స్థానిక ఎన్నిక బరిలో నిలిచి గుర్తింపుతో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పుణ్యవతి కోరారు. ఈ శిబిరంలో కూసుమంచి తిరుమల పాలెం నేలకొండపల్లి మండలాల బిజెపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమం కు కూసుమంచి మండల పార్టీ నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి, తిరుమలాయపాలెం మండల పార్టీ అధ్యక్షులు బొడ్డు ప్రసాద్ అధ్యక్షులుగా వ్యవహరించగా, కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు వెంకటరామయ్య నున్న రవికుమార్ శ్యామ్ రాథోడ్ మేక సంతోష్ రెడ్డి గడ్డం వెంకటేశ్వర్లు బజ్జూరు మల్లారెడ్డి దాసరి వెంకటేశ్వర్లు సుధాకర్ వీరన్న హత్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# వినతులను సత్వరమే పరిష్కరించాలి

### ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు

**టీ మీడియా ,ఏప్రిల్ 20, ఖమ్మం:**ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించా లని అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ పి. శ్రీనివాస్ రెడ్డి ప్రజల అర్జీలను స్వీకరించారు.చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన రాయల గోవింద రావు పీఎం ఉపాధి కల్పన పథకం క్రింద ఈడిపి ట్రైనింగ్ అందుబాటులో లేకపోవడం ఆన్లైన్ పోర్టల్ లోపల లోన్ ప్రాసెస్ ఆలస్యం అవుతున్న విషయం గురించి ఫిర్యాదు అందించగా కే.వి.ఐ.బి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కొణిజెర్ల మండలం చిన్న గోపతీ గ్రామానికి చెందిన జి. ప్రసాద్ రావు తనకు సర్వే నెంబర్ 131 లో 39 గుంటల భూమి ఉందని, 19.5 గుంటల భూమి పట్టా పాస్ పుస్తకం ఉందని, మిగిలిన 19.5 గుంటల భూమి పట్టా పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్ మండలం అల్లిపురం గ్రామానికి చెందిన ఎస్కే హుస్సేన్ తనకు 4 సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చిందని , తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డిఆర్డిఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





## ఫేస్ యాప్పై వ్యతిరేక స్వరం

### -గిరిజన ప్రాంతాల్లో ఉపాధి కూలీల నిరసనలు

**టి మీడియా ఏప్రిల్ 20 కామేపల్లి:**మండలంలోని సాతాని గూడెం మరియు గ్రామాల్లో సోమవారం నాడు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల వద్ద కూలీలు ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. సాతానిగూడెం గ్రామం జరిగిన ఈ కార్యక్రమానికి బి ఆర్ఎస్ లీగల్ సెల్ గ్రామ అధ్యక్షుడు మామిడాల రాజు బి ఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షులు మావిడాల విజయ్ కుమార్ గ్రామంలో ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... ఫేస్ యాప్ అమలు వల్ల హాజరు నమోదు సమస్యలు తలెత్తి, పనికి వచ్చిన కూలీలకు హాజరు పడకపోవడంతో కూలి పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో నెట్వర్క్ సమస్యల కారణంగా పరిస్థితి మరింత విషమంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేస్ యాప్ను వెంటనే రద్దు చేసి పాత విధానంలోనే హాజరు నమోదు చేయాలని, సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రోజువారీ కూలిని పెంచాలని, పని స్థలాల్లో తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## హాస్టల్స్ భోజనంలో పురుగుల కలకలం

### ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన

**టీ మీడియా,ఏప్రిల్20, రామగిరి :** నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ బాలుర హాస్టల్స్ భోజనంలో పురుగులు కనిపించడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం బాలుర హాస్టల్స్‌లోని మెస్‌లో మధ్యాహ్న భోజనంకై వెళ్లి విద్యార్థులకు వడ్డించిన అన్నంలో పురుగులు రావడంతో విద్యార్థులు ఇదేమి అన్నం, ఎలా తినాలి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించాలని కోరుతూ హాస్టల్ మెస్‌లకు తాళం వేశారు. దీంతో వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు హనుమాన్ తో పాటు విద్యార్థులు అధికారుల వైఖరీని నిరసిస్తూ హాస్టల్స్ మెస్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత లేకుండా ఉండటం, అందులో పురుగులు కనిపించడం యాజమన్యం వైఫల్యమేనని విమర్శించారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత వీసీ, రిజిస్ట్రార్స్ ఉండని అయితే ఈ విషయం వారికి తెలిసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఇది విద్యార్థుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఉందని తెలిపారు. యూనివర్సిటీలో గతంలో సహితం ఇలాంటి సంఘటనలు జరిగిన సందర్భంలో వీసీ స్వయంగా మాట్లాడి ఇలాంటి సంఘటనలు తిరిగి రాకుండా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. నాణ్యత లేని ఆహారం తినడంతో ఎంతో మంది విద్యార్థుల అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, సంపత్, సతీష్, విజయ్, వెంకటేష్, సుధీర్, అరవింద్, పృథ్వీ, సాయి, గోపి, ప్రణయ్ పాల్గొన్నారు.





## రిక్కాబ్ బజారులో చలివేంద్రం ఏర్పాటు

**టీ మీడియా, ఏప్రిల్ 20 , ఖమ్మం:** నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం వారి ఆధ్వర్యంలోజిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్. ఖమ్మం.రిక్కాబ్ బజా సెంటర్లో చలివేంద్రాన్ని ప్రారంభించారు.సోమవారం రోజున దాతలు పి.సాంబశివరావు సి ఈ (రిటైర్డ్) మరియు ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ వెలిగేటి విజయలక్ష్మి సహకారంతో వేసవి కాలం ఎండలను దృష్టిలో పెట్టుకొని ఖమ్మం పట్టణ ప్రజలకు దాహార్తి తీర్చేటందుకు ఈ యొక్క చలివేంద్రాన్ని విజయ నర్సింగ్ హోమ్ ప్రాంగణంలో రిక్కా బజార్ నందు ఏర్పాటు చేయగా ఖమ్మం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ మరియు సీనియర్ సభ్యులు వేగినాటి లక్ష్మయ్య చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ ఎండల్లో చలివేంద్రం ఏర్పాటు చేసిన చల్లని నీటిని తాగటం వలన ఎండల తాకిడి నుండి కొంత ఉపశమనం లభిస్తుందని అన్నారు. అదే విధంగా ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగా వున్నందున ప్రజలు అవసరం లేకుండా బయటకు రావొద్దని వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా వున్నాయని తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో కే సత్యనారాయణ రెడ్డి, మూలగుండ్ల శ్రీహరి, ఉపేందర్ రెడ్డి, జిల్లా వెంకటేశ్వర్లు, జి నాగేశ్వరరావు, పి సుధాకర్, నరసింహారావు, జాన్ పుల్లయ్య, జనార్ధన్, షకీల్ అహ్మద్ , జి మోహన్రావు మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.



## సేవలు పారదర్శకంగా ఉండాలి

**-ఎమ్మెల్యే కూనంనేని**

**టీ మీడియా, ఏప్రిల్ 20 , భద్రాద్రి కొత్తగూడెం :** అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆన్‌లైన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డులో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ ఆయా కేంద్రాల్లో సేవలను కచ్చితంగా ఆన్‌లైన్ చేసి పై అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహారం, తల్లులకు రేషన్ సరుకులు సక్రమంగా ఇచ్చేందుకే ఈ ఆన్‌లైన్ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. కొన్ని యాప్‌లు అమల్లోకి తీసుకురావడం వల్ల ప్రభుత్వమే టీచర్లకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వటం జరిగిందని ప్రతి ఏరియాలో నెట్ సౌకర్యం ఉన్నందున ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, సమస్యలకు పరిష్కారం చేస్తానన్నారు. మారుమూల గ్రామాల్లో ఇంకా అంగన్‌వాడీ కేంద్రాలు స్థల సమస్య వల్ల కొలిక్కి రాలేదని వాటిని కూడా త్వరగా పరిష్కారం చేసి అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిడిపిఓ లను ఆదేశించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి సెక్టార్ కొత్తగూడెం ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ కొత్తగూడెం సిడిపివో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## 50వ డివిజన్లో చలివేంద్రం ఏర్పాటు

**టీ మీడియా ,ఏప్రిల్ 20, ఖమ్మం :** రాపర్తి హనుమంతరావు జ్ఞాపకార్థం ఈరోజు చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. తీవ్ర ఎండలతో సతమతమవుతున్న ప్రజలకి సుమారు 500 మందికి మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది ఈ చలివేంద్రాన్ని మా అమ్మగారైన రాపర్తి శారద గారు ప్రారంభించారు 50 డివిజన్ లో చలివేంద్రం నిర్వేంచరు ఎండ లో కష్టం చేసే వారికి మజ్జిగ , మంచి నీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి శరత్ రాపర్తి అరవింద్ ,వారి కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.



# ఏరియా జీఎం కార్యాలయంలోనే నీళ్ల కరువు

**-అవసరాల కోసం ఇబ్బంది లో ఉద్యోగులు**

**టీ మీడియా, ఏప్రిల్ 20 , రుద్రంపూర్ :** ఏరియాకు గుండెకాయలాంటి జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయంలోనే తాగునీటి సమస్య తలెత్తడం ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గత సంవత్సరం అక్టోబర్‌లో హంగు ఆర్భాటాలతో కొత్తగా ప్రారంభించిన ఈ కార్యాలయంలో కనీస అవసరమైన మంచినీళ్లు కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పాత జీఎం కార్యాలయంలో ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్‌తో పాటు చల్లని నీటి సౌకర్యం ఉండేది. అయితే కొత్త కార్యాలయంలో అలాంటి సౌకర్యాలు లేకపోవడంతో తాగునీటి అవసరాల కోసం ఉద్యోగులు త్రీ ఇంక్లైన్ పంచాయతీ పరిధిలో సింగరేణి వారు ఏర్పాటు చేసిన ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్ నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవికాలం తీవ్రత పెరిగిన నేపథ్యంలో తీసుకువచ్చే నీరు కూడా సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఇలా పలుమార్లు దూరం వెళ్లి నీళ్లు తీసుకురావడం చాలా కష్టంగా మారిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పాత కార్యాలయంలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను కొత్త జీఎం కార్యాలయానికి తరలించి ఏర్పాటు చేస్తే సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని ఉద్యోగులు సూచిస్తున్నారు.



**వాష్‌రూమ్‌లలో నీటి కొరత**

కార్యాలయాన్ని అన్ని హంగులతో ఏర్పాటు చేశామని చెప్పుకుంటున్న యాజమాన్యం వాష్‌రూమ్‌లలో నీటి సరఫరాపై మాత్రం సరైన దృష్టి పెట్టలేదని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం తర్వాత వాష్‌రూమ్‌లలో నీరు అందుబాటులో లేక మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులు, సందర్శకుల సంఖ్యను అంచనా వేయకుండా తక్కువ సామర్థ్యం గల వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న ట్యాంకులకు తోడు మరిన్ని వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసి, నిరంతర నీటి సరఫరా కల్పించాలని ఉద్యోగులు కోరుతున్నారు.



## సింగరేణి మండలంలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభం

**టీ మీడియా,ఏప్రిల్20,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో బాలికల ఆరోగ్య రక్షణ కోసం హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సురేష్, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, స్థానిక సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) ప్రారంభించారు.ఈ సందర్భంగా 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాలు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హ్యూమన్ పాపిలోమా వైరస్ కారణంగా మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో ముందస్తు జాగ్రత్తగా ఈ టీకా ఎంతో కీలకమని వివరించారు.జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ టీకా అందుబాటులో ఉంటుందని పేర్కొంటూ, తల్లిదండ్రులు తమ కుమార్తెలకు తప్పనిసరిగా టీకా వేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## రాంరెడ్డి వెంకటరెడ్డి జ్ఞాపకార్థంగా చలివేంద్రం ప్రారంభం

**టీ మీడియా, ఏప్రిల్ 20 కామేపల్లి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు, దివంగత టైగర్ రాంరెడ్డి వెంకటరెడ్డి గారి స్మారకార్థం కొత్త లింగాల గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పెరిగిపోతున్న ఎండల దృష్ట్యా, ప్రయాణికులు ప్రజల దాహార్తిని తీర్చడానికి కొత్త లింగాల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు.ముఖ్య అతిథుల సమక్షంలో ప్రారంభోత్సవంఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాంరెడ్డి వెంకటరెడ్డి గారు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని, వారి జ్ఞాపకార్థం ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి జగన్నాథ రెడ్డి గారు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దొడ్డ వేణు వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యమయ్య మార్కెట్ డైరెక్టర్ మాలోత్ బొసింగ్ మండల నాయకులు ఉపేందర్ కొత్త లింగాల గ్రామ కమిటీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హరీష్ రావు .. కాళ్ళేశ్వరావు

రైతులకు మేలు చేసే పామాయిల్ ఫ్యాక్టరీని ప్రారంభించామని, ఇది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ రోజు రెండవ దఫా రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా విడుదల చేస్తున్నామని, అందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, గిడ్డంగుల శాఖ చైర్మన్ నాగేశ్వరరావు, ఖమ్మం నగర మేయర్ పూనకొల్లు నీరజ, ఖమ్మం నగర కమిటీ అధ్యక్షుడు దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ ఎక్కి గ్రామస్తుల నిరసన

**తుమ్మలకుంట చెరువు వివాదం మళ్లీ ముదిరింది**



**టీ మీడియా,ఏప్రిల్20, సింగరేణి(కారేపల్లి):** చేపల చెరువు విషయంలో అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కారేపల్లి మండలం మేకలతండా గ్రామస్తులు సోమవారం కారేపల్లి గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసనకు దిగారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. దంబ్బతండా గ్రామపంచాయతీ పరిధిలోని తుమ్మలకుంట చెరువు పట్టాభూమి, దేవాదాయశాఖ భూములలో ఉందని, అయినప్పటికీ 2011లో మత్స్యశాఖ అధికారులు అక్రమంగా సొసైటీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారని పట్టాదారులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై గ్రామంలోని ఇరువర్గాల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది.ఇటీవల ఈనెల 18న చెరువులో చేపల వేటపై వివాదం చెలరేగి, కొందరు గ్రామస్తులు లూటీకి పాల్పడినట్లు సమాచారం.ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదులు చేశాయి.అయితే పట్టాదారులైన తమపైనే కేసులు నమోదు చేశారని ఆరోపిస్తూ కొందరు గ్రామస్తులు ఆగ్రహంతో వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు.సమాచారం అందుకున్న గ్రామ పెద్దలు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు.పోలీసులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.

# బీటీ రోడ్డుపై

రోజుకు పది సార్లు తుడుచుకున్నా ఫలితం లేదని, మిషన్ల సర్వీసింగ్ కోసమే సంపాదనంతా ఖర్చవుతోందని వ్యాపారులు వాపోతున్నారు.

**పొంచి ఉన్న 'స్కిడ్ జోన్'**

రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, కంకర రాళ్ల వల్ల ఈ ప్రాంతం ఒక 'డెత్ ట్రాప్'లా మారింది. ద్విచక్ర వాహనదారులు కొంచెం వేగంగా వచ్చి బ్రేక్ వేసినా, మట్టిపై టైర్లు పట్టు కోల్పోయి వాహనం స్కిడ్ అవుతోంది. ? రాత్రి వేళల్లో రోడ్డు మార్జిన్లు కనిపించక, మట్టి మేటలను గమనించక వాహనదారులు కిందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు లేచే దుమ్ము వల్ల ఎదురుగా వచ్చే వాహనం కూడా కనిపించని పరిస్థితి.

**పన్నుల వసూళ్లలో ఉన్న శ్రద్ధ**

పంచాయతీ అధికారులు పన్నుల వసూలుపై చూపే శ్రద్ధలో కనీసం వంతైనా ఈ రోడ్డు శుభ్రతపై చూపకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. రోజూ ఇదే మార్గంలో ఏసీ కార్లలో తిరిగే ప్రజా ప్రతినిధులకు సామాన్యుడి కళ్లు కుడుతున్న దుమ్ము, వ్యాపారుల యంత్రాలు పాడవుతున్న వైనం కనిపించకపోవడం విస్మయం కలిగిస్తోంది. అభివృద్ధి అంటే కేవలం గ్రాఫిక్స్‌లో చూపించడం కాదు.. ప్రజలు నడిచే దారి భద్రంగా ఉండటం. ఒక పక్క డిజిటల్ ఇండియా అంటూ ఊదరగొడుతుంటే, మరోపక్క రోడ్డుపై దుమ్ము వల్ల డిజిటల్ యంత్రాలు పాడై వ్యాపారులు రోడ్డున పడుతున్నారు. ఇది కేవలం మట్టి సమస్య కాదు, అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల తలెత్తిన మానవ నిర్మిత విపత్తు. తక్షణమే రోడ్డును వాక్యూమ్ క్లీనర్లతో లేదా వాటర్ ట్యాంకులతో శుభ్రం చేయించి, శాశ్వత బీటి ప్యాచ్ పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.